

టన్ను చీనీ రూ.19,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19,500, కనిష్టంగా రూ.15 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.40
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.



జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.19 వేలు



మార్కెట్‌లో ఎండుమిర్చి క్రయవిక్రయాలు

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర ఎగబాకింది. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.19 వేలు, రెండో రకం రూ.17 వేలు, మూడో రకం మిర్చి రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. 142 మంది రైతులు 182.20 క్వింటాళ్ల ఎండుమిర్చిని మార్కెట్‌కు తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. బాగా ఎండిన నాణ్యమైన మిర్చిని మార్కెట్‌కు తీసుకురావాలని, అప్పుడే గిట్టుబాటు ధర లభిస్తుందని మార్కెట్ అధికారి రైతులకు సూచించారు.

హౌరా ఎక్స్‌ప్రెస్ యశ్వంతపుర వరకు పొడిగింపు

- 25 నుంచి అందుబాటులోకి



హౌరా-పుట్టపర్తి రైలు

అనంతపురం సిటీ: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు యశ్వంతపుర వరకు పొడిగించారు. ఈ నెల 25 నుంచి పొడిగింపు అమలులోకి వస్తుందని ఉత్తర్వులు జారీ చేశారు. హౌరా నుంచి పుట్టపర్తి (శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం) వయా అనంతపురం, గుత్తి, మార్కాపురం, విజయవాడ మీదుగా నడిచే ఈ రైలు (నంబర్: 22831)ను యశ్వంతపుర వరకు పొడిగించారు. యశ్వంతపుర నుంచి తిరిగి అదే రూటులో నడిచే రైలు (నంబర్: 22832) యశ్వంతపురలో తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరుతుందని అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను ఆయన కోరారు.

శ్రీనివాసులుకు ఉత్తమ రైతు అవార్డు



అవార్డును అందుకుంటున్న రైతు శ్రీనివాసులు

హిందూపురం: వందరోజుల్లోనే 98 కేజీల మేలురకం బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచిన లేపాక్షి మండలం నాగేపల్లికి చెందిన ఎస్.శ్రీనివాసులుకు ఉత్తమ రైతు అవార్డు దక్కింది. శుక్రవారం మైసూరులో జరిగిన సెంట్రల్ సిల్క్ బోర్డు సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో శ్రీనివాసులు అవార్డు అందుకున్నారు.

పోలీసుల అదుపులో బెట్టింగ్ రాయుళ్లు



పోలీసుల అదుపులో ఉన్న క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లను రాప్తాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపురం సమీపంలోని ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు ఏ- మైదానంలో గల ఈ-ఎఫ్ గ్యాలరీల్లోకి ప్రవేశించి బెట్టింగ్ ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రాప్తాడు పోలీసులు వెంటనే అప్రమత్తమై స్టేడియంలోకి చేరుకుని 15 మంది బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ ముఠాలోని కీలక సభ్యుడి కోసం గాలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నారు. బెంగళూరు నుంచి వచ్చి ఇక్కడ పాసులు ఎలా పొందారనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

రయ్.. రయ్



- ధర్మవరానికి చెందిన రామన్నకు ఇద్దరు కూతుళ్ల సంతానం. ఒకరు ఇంటర్ రెండో సంవత్సరం, మరొకరు పదో తరగతి. పెద్దమ్మాయి కళాశాల 8 గంటలకే ప్రారంభమవుతుంది. చిన్నమ్మాయి స్కూల్ 9 గంటలకు ఉంటుంది. ఇద్దరూ కలిసిపోలేరు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే రామన్న దగ్గరుండి పిల్లలను కళాశాల, పాఠశాలలో వదల్లేని పరిస్థితి. దీంతో బాగా ఆలోచించిన రామన్న పిల్లలిద్దరికీ చెరో స్కూటీ కొనిచ్చాడు. ఇప్పుడా ఇంట్లో మూడు ద్విచక్రవాహనాలు ఉన్నాయి.

- ముదిగుబ్బకు చెందిన సుదర్శన్‌కు ఇప్పటికే బైక్ ఉంది. అయితే కుటుంబమంతా బయటకు వెళ్లాలంటే బస్టాండు వరకూ వెళ్లి బస్సుకోసం వేచి చూడాలి. పైగా తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నారు. దీంతో సుదర్శన్ అందరికీ సౌకర్యంగా ఉండేలా కొత్తగా కారు కొన్నాడు. ఇప్పుడా కుటుంబం ఎటైనా వెళ్లాలంటే కారులో హాయిగా వెళ్తోంది.

..ఇలా వివిధ కారణాలతో జిల్లాలో నూతనంగా కొనుగోలు చేస్తున్న వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది.





పుట్టపర్తిలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

- జిల్లాలో పెరుగుతున్న వాహనాల వినియోగం
- ఒక్కో కుటుంబంలో రెండుమూడు వాహనాలు
- జిల్లాలో 4.77 లక్షల మార్కును దాటిన వాహనాల సంఖ్య

పుట్టపర్తి టౌన్: గతంలో పేదోడి వాహనం అనగానే సైకిల్ గుర్తుకొచ్చేది. ఇప్పుడు ఆ స్థానాన్ని బైక్ భర్తీ చేస్తోంది. ఈ రోజుల్లో వాహనం లేని ఇల్లు లేదు. అవసరం కోసం కొందరు.. ఆడంబరం కోసం మరికొందరు వాహనాలు కొనుగోలు చేస్తుండగా.. జిల్లాలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మరోవైపు ప్రజల అభిరుచికి అనుగుణంగా సరికొత్త వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి.

జిల్లాలోని వాహనాల వివరాలు ఇలా...

వాహనం	సంఖ్య
మోటార్ సైకిళ్లు	2,80,430
ఆటోరిక్షాలు	25,000
కార్లు	19,000
గూడ్స్ వెహికల్స్	12,000
ట్రాక్టర్లు	21,000
జీపులు, క్యాబ్‌లు, స్కూల్ బస్సులు	1.20 లక్షలు

80 శాతం బైక్‌లే..

నెలలో సగటున వెయ్యి వాహనాలు జిల్లాలో కొత్తగా రోడ్డు మీదకు వస్తుండగా...అందులో 80 శాతం వాహనాలు బైక్‌లే ఉంటున్నాయి. ప్రతి ఒక్కరూ అవసరాలకు అనుగుణంగా బైక్ కొంటున్నారు. ఇక ఆర్థికంగా ఉన్నవారు కార్లు కొనుగోలు చేస్తున్నారు. ఒక ఇంట్లో ఐదుగురు వ్యక్తులు ఉంటే కనీసం రెండు వాహనాలు ఉంటున్నాయి. వాహనాల కొనుగోళ్లలో బైక్, కారు, ఆ తర్వాత వ్యవసాయం కోసం రైతులు వినియోగించే ట్రాక్టర్లు ఉంటున్నాయి. రోజూ సగటున జిల్లాలో 50 నుంచి 80 దాకా బైక్‌లు, 5 నుంచి 10 వరకు కార్లు, ట్రాక్టర్లు రిజిస్ట్రేషన్ కోసం రవాణాశాఖ కార్యాలయాలకు వస్తున్నాయి. ఇలా వాహనాల క్రయ విక్రయాలు పెరగడంతో రవాణా శాఖకు కూడా ఆదాయం పెరుగుతోంది.

అవసరాలకు అనుగుణంగా వాహనాల కొనుగోలు..

ప్రస్తుతం జిల్లాలో ఒక్కో కుటుంబంలో కనీసం రెండు, మూడు వాహనాలు ఉంటున్నాయి. కుటుంబ సభ్యులందరి కోసం కారు, వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్, సొంత పనులపై వెళ్లేందుకు బైక్, మహిళల కోసం ఎలక్ట్రిక్ బైక్, బాలికల కోసం స్కూటీలు కొంటున్నారు. దీంతో ఒక్కో ఇంటి ముందు రెండు నుంచి మూడు వాహనాలు కనిపిస్తున్నాయి.

జిల్లాలో 4.77 లక్షల వాహనాలు..

జిల్లా వ్యాప్తంగా కార్లు, బైక్‌లు, వివిధ వాహనాలు కలిపి మొత్తంగా 4.77 లక్షల దాకా ఉన్నాయి. ఇవన్నీ మన రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు మాత్రమే. ఇవి కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన లక్ష వాహనాలు జిల్లాలో తిరుగుతున్నాయి. ఈ లెక్కన జిల్లాలో 6 లక్షల కుటుంబాలు ఉండగా.. దాదాపుగా 6 లక్షల వాహనాలున్నాయి.

నెలకు వెయ్యికిపైగా రిజిస్ట్రేషన్లు



జిల్లాలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇందులో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే ఉంటున్నాయి. రానున్న రోజుల్లో కొత్తగా రోడ్డెక్కే వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఐదారేళ్లుగా వ్యక్తిగత వాహనాల వినియోగమూ బాగా పెరిగింది. ఫలితంగా రోజూ వాహనాల రిజిస్ట్రేషన్లు భారీగా ఉంటున్నాయి. అన్ని రవాణా వాహనాలు కలిపి సగటున నెలకు వెయ్యికిపైగా రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

– కరుణసాగర్‌రెడ్డి డీటీసీ

అట్రాసిటీ కేసులపై దృష్టి సారించండి

- పోలీసులకు ఎస్పీ రత్న ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులను సకాలంలో దర్యాప్తు చేసి బాధితులకు త్వరగా పరిహారం అందేలా చూడాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆమె పోలీస్ కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు తీరు, రౌడీషీటర్లపై చర్యలు, పెండింగ్ కేసులు తదితర వాటిపై చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, అట్రాసిటీ కేసుల్లో బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలన్నారు. 60 రోజుల్లోపు నిందితులపై అభియోగపత్రాలు న్యాయ స్థానాల్లో దాఖలు చేయడంతో పాటు సాక్ష్యాలన్నీ కోర్టుకు సమర్పించి ముద్దాలకు శిక్ష పడేలా చూడాలన్నారు. అలాగే కోర్టు ఆదేశాల మేరకు బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టరేట్‌కు పంపాలన్నారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గ్రామ సభలు నిర్వహించి చట్టాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే జిల్లాలోని రౌడీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు మహేష్, శ్రీనివాసులు, శివనారాయణ స్వామి, డీసీఆర్‌బీ సీఐ సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో వన్‌స్టాప్ సెంటర్

- స్థల పరిశీలన పూర్తి చేసిన ఐసీడీఎస్ అధికారులు
- నిర్మాణం కోసం కేంద్రం రూ.60 లక్షల మంజూరు
- ఎనుములపల్లి ప్రాంతంలో ఏర్పాటుకు సన్నాహాలు



కదిరి: మహిళలపై వేధింపులను నియంత్రించేందుకు జిల్లా కేంద్రం పుట్టపర్తిలో 'వన్‌స్టాప్ సెంటర్' ఏర్పాటుకు ఐసీడీఎస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి స్థల పరిశీలన పూర్తయింది. ముందుగా కొత్తచెరువులో ఏర్పాటు చేయాలని భావించినా... కలెక్టర్ టి.ఎస్.చేతన్ సూచన మేరకు చివరకు జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో ఎనుమలపల్లి పీహెచ్‌సీ ప్రాంగణాన్ని ఐసీడీఎస్ అధికారులు ఎంపిక చేశారు.

నిధులు మంజూరు...

పుట్టపర్తిలో వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్భయ ఫండ్ కింద రూ.60 లక్షల నిధులను మంజూరు చేసింది. వన్‌స్టాప్ సెంటర్‌ను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయనున్నారు. లింగ ఆధారిత హింస, వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా వన్‌స్టాప్ సెంటర్ పనిచేయనుంది. గృహ, లైంగిక వేధింపులు, పరువు హత్యలు, వరకట్నం, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బలవంతపు సెక్స్, అబార్షన్లు చేయడం, వేధింపులకు గురైన మహిళలు, యువతులు, బాలికల సంరక్షణ, అవసరమైన న్యాయ, వైద్య సహాయం తదితర సేవలను 'వన్‌స్టాప్ సెంటర్' ద్వారా ఉచితంగా అందిస్తారు. బాధిత మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఐదు రోజుల వరకూ ఈ సెంటర్ లోనే ఆశ్రయం కల్పిస్తారు. ఆ సమయంలో వారి వెంట పిల్లలను కూడా ఉంచుకోవచ్చు. అయితే 8 ఏళ్లు పైబడిన అబ్బాయిలను తల్లితో పాటు వన్‌స్టాప్ సెంటర్‌లో ఉండేందుకు అనుమతించరు. తాత్కాలిక వసతి పొందినన్ని రోజులూ బాధితులకు భోజనంతో పాటు తగిన మందులు, ఇతర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో ఎవరెవరు ఉంటారు?

బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఒక కౌన్సిలర్, లీగల్ అడ్వైజర్, సోషల్ వర్కర్, మెడికల్ సిబ్బంది, పోలీస్ ఫెసిలిటేషన్ అధికారి, ఐటీ సిబ్బంది, సెంటర్ మేనేజర్, సెక్యూరిటీ గార్డు కూడా ఉంటారు. వీరు ప్రధానంగా గృహ హింస, పని చేసే ప్రాంతాల్లో మహిళలకు వేధింపులు.. వంటి సమస్యలను ప్రధానంగా స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తారు. జిల్లా స్థాయిలో ఐసీడీఎస్ పీడీ, డివిజన్ స్థాయిలో సీడీపీఓల పర్యవేక్షణలో వన్‌స్టాప్ సెంటర్ల నిర్వహణ కొనసాగుతుంది.

మంజూరైంది వాస్తవమే



జిల్లాకు వన్‌స్టాప్ సెంటర్ మంజూరైంది వాస్తవమే. ఇందుకోసం రూ.60 లక్షలు నిధులు కూడా మంజూరయ్యాయి. భవన నిర్మాణం కోసం ఎనుమలపల్లి పీహెచ్‌సీ కేంద్రం వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించాం. ఇదే అనువైన స్థలం కావడంతో అక్కడే భవనాన్ని నిర్మించాలని నిర్ణయించాం.

– నాగమల్లేశ్వరి, ఐసీడీఎస్ పీడీ

ఇది ప్రజలను ముంచిన ప్రభుత్వం

- వేంకటేశ్వర స్వామి పేరుతో రాజకీయం చేస్తే సర్వనాశనమవుతారు
- అధికారం చేపట్టి వందరోజులైనా సీఎం ఒక్కహామీ నెరవేర్చలేకపోయారు
- తన అసమర్థపాలనను కప్పి పుచ్చుకునేందుకు లడ్డూ పేరుతో డైవర్షన్ డ్రామాలు
- చంద్రబాబుపై మండిపడిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మీడియాతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

పరిగి: ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి సారీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. తిరుమల లడ్డూ కోసం వాడే నెయ్యిపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 87 శాతం హామీలు నెరవేర్చారని, కానీ ప్రస్తుత సీఎం చంద్రబాబు వందరోజుల్లో ఒక్క హామీ నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. పైగా ప్రజలను ఏదో ఉద్ధరించినట్లు వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. కూటమి నేతలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారని, కానీ ఇది ప్రజలను 'ముంచే' ప్రభుత్వమన్నారు. వందరోజుల్లో ప్రజలకు ఏమీ చేయలేని చంద్రబాబు..తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు 'తిరుపతి లడ్డూ' ప్రసాద తయారీ అంశాన్ని తెరపైకి తెచ్చి డ్రామాలు ఆడుతున్నారన్నారు. తద్వారా ప్రజల దృష్టి మరల్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారన్నారు.

దశాబ్దకాలంగా ఒకటే ప్రక్రియ..

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ ప్రక్రియకు సంబంధించి టీటీడీకి ఒక నిర్దిష్టమైన నిబంధలున్నాయన్నారు. దశాబ్దాలుగా అక్కడే అవే నిబంధనలు అమలుచేస్తున్నారని ఉషశ్రీచరణ్ అన్నారు. లడ్డూ కోసం వాడే నెయ్యి, ఇతర పదార్థాలను టీటీడీ మూడు ప్రక్రియల్లో పరిశీలించిన తర్వాతే అనుమతిస్తుందని, సీఎం చంద్రబాబుకు తెలియదా...అని ఆమె ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలోనే నాణ్యత లోపించిన కారణంగా టీటీడీ 15 సార్లు నెయ్యి కంటెయినర్లను వెనక్కి పంపిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న టీటీడీ నిబంధనలు మారవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనూ అదే నిబంధనలు అమలయ్యాయని...2019 నుంచి 2024 మధ్యకాలంలో 18 సార్లు నెయ్యి నాణ్యతపై అభ్యంతరం తెలిపిన టీటీడీ అధికారులు కంటెయినర్లను వెనక్కి పంపినట్లు ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు దేవుడి పేరును అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని, ఇలాంటి వారు దైవాగ్రహంతో సర్వనాశనమవుతారని మండిపడ్డారు. అధికారంలో ఉన్న వారు ప్రజలకు మంచి చేయాలి గానీ, ఇలా నీతిమాలిన రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్, సీఎం చంద్రబాబు విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో పరిగి, రొద్దం మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు నరసింహమూర్తి, బోయ తిమ్మయ్య, ఎర్రగుంట సర్పంచ్ బాలకృష్ణ, రొద్దం మండల జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, మైనార్టీ నాయకుడు రఫీక్ ఖాన్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

- రాయితీ సూక్ష్మసేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి
- రైతులకు కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు



అరటి తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్పు సిస్టంను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి అర్బన్/చిలమత్తూరు: జిల్లా రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఉద్యాన పంటలైన పండ్లతోటల సాగుపై దృష్టి సారిస్తే అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, కొత్తచెరువు మండలం బైరాపురం, చిలమత్తూరు మండలం కోడూరు, ముద్దేపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారులుతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా రాయితీతో అందించే బిందు, తుంపర సేద్య పరికరాలను వినియోగించుకుని సాగునీటిని ఆదా చేసుకోవాలన్నారు. డ్రిప్ వినియోగం ద్వారా నీటి యాజమాన్యం సక్రమంగా ఉంటుందన్నారు. ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం అందిస్తామన్నారు. పంటసాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అంతకుముందు ఆయన అరటి రైతు హర్షవర్ధన్‌రెడ్డిని పంటల సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. తనకు 20 ఎకరాల భూమి ఉండగా, 90 శాతం సబ్సిడీతో గత ప్రభుత్వంలో డ్రిప్పు ఏర్పాటు చేశానని రైతు తెలిపాడు. మొదటి కోతలో 12 టన్నుల దిగుబడి రాగా, రూ.15.6 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఇక కోడూరులో రైతు ప్రభాకర్‌తో కలెక్టర్ మాట్లాడారు. తాను సంప్రదాయ పంట వేరుశనగకు స్వస్తి చెప్పి 10 ఎకరాల్లో దానిమ్మ సాగు చేశానని, తొలి విడతలోనే తనకు రూ.50 వేల ఆదాయం వచ్చినట్లు రైతు వివరించారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరాడు. కలెక్టర్ వెంట ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా హార్టికల్చర్ అధికారి జి. చంద్రశేఖర్, మండల అధికారి మహేష్ నాయక్, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ నరసింహప్ప, ఆర్‌ఎస్‌కే అధికారి లోకేష్, మైక్రో ఇరిగేషన్ డీలర్ భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత ఇసుక బుకింగ్ సులభతరం..

ప్రశాంతి నిలయం: ప్రజలు ఉచిత ఇసుకను బుకింగ్ చేసుకునే విధానంలో మార్పులు చేసి మరింత సులభతరం చేశామని కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న చిగుళ్లరేవు, పెద్ద చిగుళ్లరేవు రీచ్‌లలో ఇసుక అందుబాటులో ఉందని, కావాల్సిన వారు సమీపంలోని డిపోల ద్వారా ప్రజలు ఉచిత ఇసుక పొందవచ్చన్నారు. రోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇసుక లోడింగ్ ఉంటుందన్నారు. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని, అయితే నిర్వహణ, అదనపు ఖర్చుల కోసం టన్నుకు రూ.399 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్వచ్ఛతా హీ సేవ'

ప్రశాంతి నిలయం: 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, డివిజన్, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో తప్పనిసరిగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించాలని, వాటికి సంబంధించిన ఫొటోలను జిల్లా వాట్సాప్ గ్రూప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.

ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు హేయం

- టీడీపీ నేత వెంకటేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

పరిగి: మండలంలోని శాసనకోట సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్ రెడ్డిని దుర్భాషలాడిన టీడీపీ నేత శాసనకోట వెంకటేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఏపీజీఈఏ జిల్లా, తాలూకా, మండల స్థాయి నేతలతో కలిసి పరిగికి విచ్చేశారు. టీడీపీ నేత వెంకటేష్, సచివాలయ ఉద్యోగి పవన్‌కుమార్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణపై ఆరా తీశారు. అనంతరం ఎస్‌ఐ రంగడు యాదవ్, తహసీల్దారు హసీనా సుల్తానా, మండల వ్యవసాయాధికారి విజయభారతిని కలిసి టీడీపీ నేత వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులన్న కనీస గౌరవం లేకుండా సభ్యసమాజం సిగ్గుపడేలా టీడీపీ నేత మాట్లాడటం సమంజసం కాదన్నారు. గ్రామాల్లో ఇలాంటి భయానక వాతావరణం కలిగిస్తే ఉద్యోగులకు భద్రత కరువవుతుందన్నారు. ఉద్యోగస్తులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండకూడదని తెలిసినప్పటికీ ఇలాంటి వేధింపులకు పాల్పడటం శోచనీయమన్నారు. ఉన్నతాధికారులు పవన్ కుమార్‌రెడ్డికి న్యాయం చేసేవరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. త్వరలో కలెక్టర్, ఎస్పీని కలిసి చర్యలకు విన్నవిస్తామని తెలిపారు. కాగా, టీడీపీ నేత తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తామని బెదిరిస్తున్నారని సచివాలయ ఉద్యోగి పవన్‌కుమార్ ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీలు శివరాజ్, వెంకటేష్, పెనుకొండ తాలూకా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ గౌస్, మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జింకా రామాంజినేయులుకు జాతీయ పురస్కారం


కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రామాంజినేయులు

ధర్మవరం : పట్టణానికి చెందిన చేనేత ప్రముఖుడు జింకా రామాంజినేయులును బెస్ట్‌వీవర్‌గా ఎంపిక చేస్తూ జాతీయ స్థాయి పురస్కారంతో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ సత్కరించారు. శుక్రవారం కర్ణాటకలోని మైసూర్‌లో సెంట్రల్ సిల్క్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ అవార్డును జింకా రామాంజినేయులుకు అందజేశారు. భారత దేశ, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జింకా రామాంజినేయులు తయారు చేసిన పట్టుచీరకుగానూ ఈ అవార్డు దక్కింది.

లేదాళ్లకు విమలాశాంతి పురస్కారం


లేదాళ్ల రాజేశ్వరరావు

అనంతపురం కల్చరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మక కవులు, రచయితలకు అందించే విమలాశాంతి కవితా పురస్కారం... ఈ ఏడాదికి గాను ప్రఖ్యాత కవి లేదాళ్ల రాజేశ్వరరావుకు దక్కింది. ఈ మేరకు నిర్వాహకులు, డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం వెల్లడించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన లేదాళ్ల రాజేశ్వరరావు రచించిన 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవితా సంపుటిని విమలాశాంతి కవితా పురస్కారానికి ఎంపిక చేశామన్నారు. అక్టోబర్ 10న అనంతలో జరిగే సాహితీ సభలో అవార్డుతో పాటు రూ.10వేల నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన మూడు వేర్వేరు ప్రాంతాలకు చెందిన సుప్రసిద్ధ సాహితీవేత్తలు ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి, బెల్లంకొండ ప్రసేన్, తూముచర్ల రాజారాంకు ఈ సందర్భంగా డాక్టర్ శాంతి నారాయణ ధన్యవాదాలు తెలిపారు.

రూ.50 కోసం చితకబాదారు

పెద్దవడుగూరు: అప్పుగా తీసుకున్న రూ.50 చెల్లించాలని అడిగినందుకు ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం భీమునిపల్లికి చెందిన నాగరాజు తన ద్విచక్ర వాహనంలో పెట్రోలు అయిపోవడంతో అటుగా వెళుతున్న అదే గ్రామానికి చెందిన సుంకన్నతో రూ.50 అప్పుగా ఇప్పించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత సుంకన్న కుమారుడు పెద్దిరాజు... నాగరాజు ఇంటికి వెళ్లి రూ.50 ఇవ్వాలని అడిగాడు. ఆ సమయంలో నాగరాజు, ఆయన కుటుంబసభ్యులు రాజశేఖర్, కమ్మక్క దుర్భాషలాడుతూ పెద్దిరాజుపై కర్రలతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పెద్దవడుగూరు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశం
- అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని సభ్యుల డిమాండ్
- అడవి జంతువుల బారి నుంచి పంటలు కాపాడాలని వేడుకోలు
- నష్టపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పట్టు
- పశువుల షెడ్ల కేటాయింపులో పార్టీలు చూడొద్దని వినతి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు

అనంతపురం సిటీ: సమావేశంలో ఏ నిర్ణయం తీసుకున్న రైతు సంక్షేమానికి దోహదపడేలా ఉండాలని అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరో వైపు అడవి జంతువుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారని, చివరకు మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల నుంచి రైతులను గట్టెక్కించేలా ప్రతిపాదనలు సిద్ధం చసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. స్థాయీ సంఘం-1, 2, 4, 7(ప్రణాళిక, ఆర్థిక/గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్య/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలను బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సీఈఓ ఓబులమ్మ పాల్గొన్నారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఏం చర్యలు తీసుకున్నారో వివరించాలని అధికారులకు గిరిజమ్మ సూచించారు. ఆ తర్వాత రైతుల కష్టాలను సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. అడవి జంతువులను కట్టడి చేసి పంటలను కాపాడాలని, ఇప్పటికే నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దీనిపై అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ.. వన్యప్రాణుల ద్వారా పంట నష్టపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే వెసలుబాటు ఉందన్నారు. అయితే వాటి విధి విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని గిరిజమ్మ సూచించారు.

షెడ్ల కేటాయింపులో పార్టీలు చూడొద్దు..

గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ శాఖ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ... పశువుల పోషణకు సంబంధించి షెడ్ల నిర్మాణంపై కొన్ని మండలాల ఎంపీడీఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరికొన్ని మండలాల్లో టీడీపీకి చెందిన వారికే మంజూరు చేస్తామని బహిరంగంగా చెబుతున్నారంటూ మండిపడ్డారు. పశు పోషకుల విషయంలో పార్టీలు చూడడం సరికాదని హితవు పలికారు. అర్హత కలిగిన పాడి రైతులందరికీ పథకాలు వర్తించేలా చూడాలని కోరారు.

బిల్లులు చెల్లించకపోతే పనులు ఆపేస్తాం..

గతంలో చేసిన రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు రూ.లక్షల్లో పేరుకుపోయాయని, వీటిని చెల్లించకుండా కూటమి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోందని సభ్యులు మండిపడ్డారు. బిల్లులు మంజూరు చేయకపోతే ఎక్కడికక్కడ పనులు ఆపేస్తామని హెచ్చరించారు. మిగిలిన శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. గత సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తీసుకున్న చర్యలను వివరించారు.

సాంఘిక సంక్షేమ శాఖలపై..

స్థాయీ సంఘం-6 సమావేశం అదనపు భవన్‌లో ఆ సంఘం చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో పాటు అనుబంధ శాఖల అధికారులూ హాజరయ్యారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. చలి కాలం వస్తున్నందున హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేస్తే ఎలా?

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా, తరగతులకు హాజరు కాకుండా కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు వేధిస్తున్నాయని సభ్యులు ఆరోపించారు. దీంతో డిగ్రీ, ఆ పై తరగతులు చదివే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌ఐఓ వెంకటరమణా నాయక్, డీఈఓ వరలక్ష్మి స్పందించారు. ఇంటర్ వరకూ అమ్మ ఒడి వర్తిస్తుందని, ఆ పై సాంకేతిక, ఇతర ఉన్నత విద్య చదివే విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని, ఈ అంశం తమ పరిధిలో లేదని పేర్కొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి సహకరించండి..

జెడ్పీలోని అదనపు సమావేశ భవన్‌లో జరిగిన స్థాయీ సంఘం-5(ఐసీడీఎస్) సమావేశానికి ఆ సంఘం చైర్ పర్సన్ హెచ్.హసీనాబాను అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఈఓ లలితాబాయి హాజరయ్యారు. బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు తమ శాఖ వంద రోజుల ప్రణాళిక రూపొందించుకొని ఊరూరా, వాడవాడలా ప్రచారం చేస్తోందని, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలని ఉభయ జిల్లాల ఐసీడీఎస్ పీడీలు శ్రీదేవి, నాగమల్లేశ్వరి కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అక్కడక్కడ తలెత్తుతున్న సమస్యలను అధికారుల దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

ముందుకు కదలని గూడ్స్ రైలు వీల్స్

- ఆలస్యంగా నడిచిన పూణే ఎక్స్‌ప్రెస్


ఇంజిన్‌కు మరో ఇంజిన్‌ను జత చేస్తున్న సిబ్బంది

గుంతకల్లు: రైల్వే జంక్షన్ సమీపంలోని సౌత్ క్యాబిన్ వద్ద గూడ్స్ రైలు వీల్స్ ముందుకు కదలక నిలిచిపోయింది. దీంతో పూణే ఎక్స్‌ప్రెస్ రైలు గంటన్నరకు పైగా ఆలస్యంగా నడిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని రాయచూర్ సమీపాన ఓ ఫ్యాక్టరీకి బొగ్గు లోడ్‌తో వెళుతున్న గూడ్స్ రైలును శుక్రవారం గుంతకల్లు జంక్షన్‌లోని సౌత్ క్యాబిన్ వద్ద లూప్‌లైన్‌లోకి మళ్లించారు. అయితే ఆ మార్గంలో నిర్వహణ పనుల్లో భాగంగా పట్టాలకు గ్రీస్ పూశారు. ఈ గ్రీస్ గూడ్స్ రైలు చక్రాలకు అంటుకుంది. దీనికి తోడు అధిక లోడింగ్ కారణంగా చక్రాలు అక్కడికక్కడే తిరగడంతో లోకో పైలట్ వెంటనే రైలు నిలిపివేశాడు. అదే సమయంలో కన్యాకుమారి- పూణే (16832) ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు రైల్వేస్టేషన్ రావాల్సి ఉండగా తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు గూడ్స్ రైలు చక్రాలకు పూసుకున్న గ్రీస్‌ను శుభ్రం చేసి, మరో ఇంజిన్ అటాచ్ చేసి ముందుకు కదిలించారు. దీంతో తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌కు 9.45 గంటలకు చేరుకున్న పూణే ఎక్స్‌ప్రెస్ 11.15 గంటలకు జంక్షన్‌లోకి ప్రవేశించింది.

సీఐపై ఫిర్యాదు చేయండి : ఎస్పీ

పుట్టపర్తి టౌన్: 'ఓసీగా ఏసీ తీసుకెళ్లిన సీఐ' అంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అంశంపై బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేస్తే తక్షణమే విచారణ చేపడతామని ఎస్పీ రత్న అన్నారు. 15 రోజులుగా సోషియల్ మీడియాలో వైరల్ అవుతున్న సీఐ దౌర్జన్యంపై ఎస్పీ స్పందించారు. బాధితులే కాకుండా సాక్షులు ఎవరైనా ఉన్నా ఫిర్యాదు చేయవచ్చునని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు.

యువకుడి బలవన్మరణం

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడు నివాసి శ్రీనివాసులు (35) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లి రాజేశ్వరి.. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న కుమారుడిని గమనించి, చుట్టుపక్కల వారి సాయంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఉదయం శ్రీనివాసులు మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పని సర్దుబాటులోని లోపాలు సరిచేయాలి


డీఈఓ కార్యాలయ ఏడీ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఉపాధ్యాయుల పని సర్దుబాటులోని లోపాలను సరిచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ శాఖ సభ్యులతో కలసి డీఈఓ కార్యాలయ ఏడీ నాగరాజుకు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. నిబంధనలు తుంగలో తొక్కి కదిరి అర్బన్, రూరల్, ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పని సర్దుబాటు చేశారని మండిపడ్డారు. కదిరి మండలం కమ్మవారిపల్లిలో 169 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒక పీఎస్ హెచ్‌ఎం, ఐదుగురు ఎస్జీటీలు ఉండాలన్నారు. అయితే సర్దుబాటు తర్వాత ఏకంగా 10 మంది ఉపాధ్యాయులను కేటాయించారన్నారు. అలాగే మెటుకుపల్ల పాఠశాల, కదిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇదే రీతిలో పని సర్దుబాటు చేశారన్నారు. ఉర్దూ స్కూళ్లకు తెలుగు మీడియం ఉపాధ్యాయులను కేటాయించారని, రొద్దం మండలం రాగిమేకలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడుగురు విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, కదిరిలో 20మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో సింగిల్ టీచర్ పనిచేస్తున్నారని 1,415 మంది విద్యార్థులున్న చోట కూడా ఇద్దరు టీచర్లను మాత్రమే కొనసాగిస్తున్నారని వివరించారు. ఈ లోపాలను తక్షణమే సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, బాబు, బాబావలి, సంతోష్, జగన్ తదితరులు పాల్గొన్నారు

వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది

- వ్యక్తి హత్య కేసులో మిస్టరీని ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: ఈ నెల 11న కొత్తచెరువులో చోటు చేసుకున్న వ్యక్తి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం కారణంగానే వ్యక్తి హత్యకు గురైనట్లు నిర్ధారించి, నిందితులను అరెస్ట్ చేశారు. కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు వెల్లడించారు. కొత్తచెరువు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన బూచర్ల గంగాద్రి... కొత్తచెరువులో నివాసముంటున్న లక్ష్మీదేవితో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఈ క్రమంలోనే తమ మధ్య ఉన్న సంబంధాన్ని బట్టబయలు చేస్తూ సమాజంలో ఆమె గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లేలా ప్రవర్తించాడు. ఇదేమని బాధితురాలు ప్రశ్నిస్తే.. ఆమెను వేధింపులకు గురి చేస్తూ రావడంతో విసిగిపోయిన ఆమె తన తల్లి రత్నమ్మ, అన్న శంకరరెడ్డితో చెప్పుకుని బాధపడింది. దీంతో ఈ నెల 11న రాత్రి నెహ్రూనగర్ కాలనీ శివారులో వెళుతున్న గంగాద్రిని రత్నమ్మ, శంకరరెడ్డి అడ్డుకుని పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఆ సమయంలో వారి మధ్య మాటామాట పెరగడంతో కట్టెలతో రత్నమ్మ, శంకరరెడ్డి, లక్ష్మీదేవి దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన గంగాద్రి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. హతుడి సోదరి పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... పక్కా ఆధారాలతో శుక్రవారం మధ్యాహ్నం రత్నమ్మ, శంకరరెడ్డి, లక్ష్మీదేవిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఇందిర, సిబ్బందిని ఏఎస్పీ శ్రీనివాసులు అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు.

జాబ్‌చార్ట్ ప్రకారమే విధులు కేటాయించాలి

- సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థ

హిందూపురం: సచివాలయ ఉద్యోగుల ఆవేదనను కూటమి ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని, వలంటీర్ల విధులను సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ వేధిస్తోందని సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాబ్ చార్ట్ ప్రకారమే తమకు విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సచివాలయ దివ్యాంగ ఉద్యోగులకు ఫీల్డ్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బెస్ట్ సెరికల్చర్ సైంటిస్ట్‌గా డాక్టర్ కేపీ


అందుకున్న అవార్డుతో డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: రాప్తాడులో ఉన్న ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం జాయింట్ డైరెక్టర్ (జేడీ), సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్‌కు బెస్ట్ సెరికల్చర్ సైంటిస్ట్ అవార్డు దక్కింది. కేంద్ర పట్టు మండలి, జౌళి మంత్రిత్వశాఖ 75వ వార్షికోత్సవం (ప్లాటినం జూబ్లీ) సందర్భంగా కర్ణాటకలోని మైసూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ తదితరుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. దేశంలోని 26 రాష్ట్రాలకు చెందిన పట్టు పరిశ్రమ శాస్త్రవేత్తలు, శాస్త్ర నిపుణులు, పట్టు రైతులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా పట్టుమండలి పరిధిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో చేసిన సేవలు, పరిశోధనలు, విస్తరణ, రైతులకు ఉపయోగపడేలా ఆవిష్కరణలు, ఉత్తమ ప్రతిభ కనబరచిన శాస్త్రవేత్తలను గుర్తించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్‌ను రాష్ట్ర పట్టుపరిశ్రమశాఖ అడిషినల్ డైరెక్టర్ సి.అరుణకుమారి, ఉమ్మడి జిల్లా అధికారులు ఆంజనేయులు, పద్మమ్మ, ఆ శాఖ అధికారులు అభినందించారు.

పెళ్లికి దారి తీసిన ఇన్‌స్టాగ్రామ్ పరిచయం


గంగాధర్, అనూష

సోమందేపల్లి: మూడు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన వారిద్దరూ నేడు ఒక్కటయ్యారు. వివరాలు... సోమందేపల్లి మండలం మాగే చెరువు నివాసి గంగాధర్‌కు మూడు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలంగాణలోని జగిత్యాలకు చెందిన అనూష పరిచయమైంది. తరచూ ఇన్‌స్టాగామ్‌లో మాట్లాడుకునే వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఈ క్రమంలో శుక్రవారం ఆమె సోమందేపల్లికి చేరుకుని తాను ఇష్టపడిన గంగాధర్‌ను పెళ్లి చేసుకుంది. వీరి పెళ్లికి ఇద్దరి తరఫున పెద్దలు అంగీకరించకపోవడంతో తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు. గ్రామస్తులు కల్పించుకుని అండగా ఉంటామని భరోసానివ్వడంతో వివాదానికి సద్దుమణిగింది.

ఒత్తిళ్ల మధ్య ఈ-క్రాప్

- బూతులతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- అధికారులు.. ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేక సిబ్బంది సతమతం
- సర్వర్ సతాయింపులు, ఒత్తిళ్ల మధ్య రాత్రింబవళ్లు పంట నమోదు


ఆత్మకూరు మండలం సిద్ధరాంపురంలో రాత్రి 9 గంటల సమయంలో ఈ-కేవైసీకి బారులు తీరిన రైతులు

అనంతపురం అగ్రికల్చర్: అధికార తెలుగుదేశం పార్టీ 'తమ్ముళ్లు' తమ ప్రతాపాన్ని రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) సిబ్బందిపై చూపిస్తున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. గ్రామస్థాయిలో రైతులకు సేవలందిస్తున్నారనే గౌరవం, కనికరం, ఇంగితజ్ఞానం లేకుండా తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తున్నట్లు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఖరీఫ్ పంట నమోదుకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతుండగా, అలాగే 80 శాతం సబ్సిడీతో ఉలవ, పెసర, అలసంద, మినుము, కొర్ర, సజ్జ లాంటి ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కొనసాగిస్తున్నారు.

సిబ్బందిపై బండబూతులు..

మా ప్రభుత్వం అధికారంలో ఉంది. పంట వేయకున్నా మా పొలాలు, పేర్లు ఈ-క్రాప్‌లోకి ఎక్కించాలని, మేము చెప్పిన పంటనే నమోదు చేయాలని ఆర్‌ఎస్‌కే సిబ్బందికి టీడీపీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. కక్ష సాధింపు చర్యల్లో 'వైఎస్సార్‌సీపీ' ముద్ర వేసి కొందరు రైతుల పంట పొలాలు ఈ-క్రాప్ చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీ చోటామోటా నేతలు తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నట్లు చెబుతున్నారు. చెప్పిన మాట వింటే ఓకే... లేదంటే బెదిరించడం, ఆడ, మగా తేడా లేకుండా బండబూతులు తిట్టడం చేస్తున్నారని చాలామంది బయటకు చెప్పుకోలేక మదనపడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా పరిగి మండలం శాసనకోట ఆర్‌ఎస్‌కే సిబ్బందిపై ఆదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఒకరు ఫోన్‌లో రాయలేని పదజాలంతో పదే పదే దూషించిన విషయం తెలిసిందే.

సర్వర్ సతాయింపు..

ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ చాలా పథకాలకు కొలమానం కావడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నెల 23న తుది గడువు. సమయం తక్కువగా ఇచ్చి ప్రతి పొలం, ప్రతి రైతు వివరాలు చేయడానికి చాలా ఇబ్బందిగా ఉందని సిబ్బంది చెబుతున్నారు. తరచు సర్వర్ మొరాయించడం, అవగాహన లేని రైతులు సమయానికి ఓటీపీ చెప్పలేని పరిస్థితి ఉండటం, గడువులోపు పూర్తి కావాలని రోజుకు నాలుగైదుసార్లు పైఅధికారులు ఫోన్లలో హెచ్చరిస్తుండటంతో తమ పరిస్థితి ఘోరంగా ఉందని పలువురు ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ సమస్య, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారానికి పై అధికారులు చొరవ చూపకపోవడంతో కుటుంబాన్ని పట్టించుకోకుండా రాత్రింబవళ్లు పనిచేయాల్సి వస్తోందని చెబుతున్నారు. 100 శాతం ఈ-క్రాప్ పూర్తి కాగా... 60 శాతం వరకు ఈ-కేవైసీ పూర్తయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

గత ప్రభుత్వంలో సాఫీగా ఈ-ప్రక్రియ

ఈ కార్యక్రమాన్ని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఒకటి అరా మినహా చాలా సాఫీగా విజయవంతంగా కొనసాగించారు. సాగు చేసిన ప్రతి పంటనూ ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేసి అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడిరాయితీ), ఇన్సూరెన్స్ (ఉచిత పంటల బీమా పరిహారం), ఎంఎస్‌పీ అమ్మకాలు, సున్నా వడ్డీ పంట రుణాలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలు దక్కేలా చూశారు. ఎక్కడా పార్టీ ముద్ర లేకుండా రైతులంతా ఒక్కటే అనే భావనతో పనిచేశామని సిబ్బంది చెబుతున్నారు.

రెండో రోజూ పరుగుల వరద

- సెంచరీతో ఆకట్టుకున్న అభిమన్యు, సంజు
- అభిమానులను నిరాశపరిచిన సూర్యకుమార్‌యాదవ్
- ఇండియా- బీ 210/6
- ఇండియా-సీ 216/7



సెంచరీ అనంతరం అభివాదం చేస్తున్న అభిమన్యు ఈశ్వరన్, సంజు శాంసన్

అనంతపురం: అనంత క్రీడా గ్రామం వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఉత్కంఠగా సాగుతోంది. ఇండియాఏ, సీ జట్ల మధ్య, ఇండియా-బీ, డీ జట్ల మధ్య చివరి రౌండ్ రెండో రోజు మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి.

శతకాల మెరుపులు..

306/5 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన ఇండియా-డీ జట్టు .. 87.3 ఓవర్ల వద్ద 349 పరుగులకు ఆలౌట్ అయింది. ఇండియా- బీ బౌలర్ నవదీప్ షైనీ ఐదు వికెట్లను కైవసం చేసుకున్నాడు. ఇండియా-డీ జట్టులో సంజు శాంసన్ 106 (101 బంతుల్లో 12 ఫోర్లు, మూడు సిక్సర్లు)తో ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇండియా-బీ జట్టు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ మరోసారి తనదైన శైలిలో చెలరేగి 116 (170 బంతుల్లో 13ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు చేశాడు. జగదీషన్ 13, సుయాష్ ప్రభుదేశాయ్ 16, ముషీర్ ఖాన్ 5, సూర్యకుమార్ యాదవ్ 5, నితీష్ కుమార్ రెడ్డి డకౌట్ అయ్యారు. క్రీజులో వాషింగ్టన్ సుందర్ 39, రాహుల్ చహర్ 0 ఉన్నారు. ఇండియా -డీ బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3, ఆదిత్య ఠాకరే 2 వికెట్లు తీశారు.

బౌలర్ల ధాటికి 'సీ' విలవిల..

224/7 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన ఇండియా- ఏ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 297 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులో రావత్ 124, ఆవేశ్‌ఖాన్ 51 (5 ఫోర్లు, 4 సిక్స్‌లు), సామ్స్ ములాని 44 (5 ఫోర్లు, ఒక సిక్సర్), ప్రసిద్ధ్ కృష్ణ 34(7 ఫోర్లు) సాధించారు. ఇండియా -సీ బౌలర్లు వైశాఖ్ 4, అన్షుల్ కాంబోజ్ 3, గౌరవ్ యాదవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇండియా-సీ జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. ఇండియా-ఏ బౌలర్ అకీబ్‌ఖాన్ (3 వికెట్లు), సామ్స్ ములాని (2 వికెట్లు) ధాటికి 'సీ' జట్టు బ్యాటర్లు నిలవలేకపోయారు. ఇండియా-సీ జట్టులో అభిషేక్ పోరెల్ 82 (113 బంతుల్లో 9 ఫోర్లు) పరుగులు చేశాడు. బాబా ఇంద్రజిత్ 34, రుతురాజ్ గైక్వాడ్ 17, సాయి సుదర్శన్ 17 పరుగులు చేశారు. నారంగ్ 35, వైశాఖ్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు.